'బోర్ కొడుతోంది. సరదాగా ఓ ప్రేమకథ చెప్పు' అన్నాడు చంద్రమోహన్. అతను ఆఫీస్ లో నా సహోద్యోగి.

'సరే. విను...' అంటూ మొదలెట్టాను.

సోమవారం ఉదయం పదకొండుగంటలు.

ఆఫీసు బిజీగా వుంది. పక్క సీట్‌కేసి వంగి మాట్లాడుతున్నాడు చిన్నారావ్. "మీరు నా మానసిక జీవితాన్ని చాలా ఒడిదుడుకులకు లోను చేశారు. నిజం"

కిలకిలా నవ్వింది ప్రేమ! లోను చేశానా! ఈ అప్పుల తిప్పలు వద్దు మహాప్రభో" అంది. అతనికేసి చూళ్లేదు.

చిన్నారావ్‌కి భావోద్వేగం ఎక్కువైంది. చెప్పుకుపోతున్నాడు... "మిమ్మల్ని చూస్తుంటే



# సరదాగా ఓ ప్రేమ కథ

– స్వీట్ డెవిల్' అనాలనిపిస్తోంది"

'వ్వా...ట్!' విస్తుపోతూ చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ చూసింది. ఆ చూపులో చురుకు దనం, చిలిపిదనం చదువుకున్నాడు చిన్నారావ్. ఆమె చున్నీ సర్దుకుంది.

తనను తాను సర్దుకుంటున్నట్లు అన్నాడు చిన్నారావ్, "అయామ్ సారీ. తొందరపడి నా మనసులోని మాటను అనేశాను. ఏమీ అను కోరుగదూ. సారీ..." కలవరపడ్డాడు.

ప్రేమ నవ్వింది – అధరం మీద కెంపులు మెరిసినట్లు.

సగం నిద్రలో మాట్లాడుతున్నవాడిలా అంటూనే వున్నాడు చిన్నారావ్. "మీతో నేను చాలా మాట్లాడాలి. ఐ మీన్..." అని అర్థోక్తిలో ఆపేడు.

ఆమె మళ్లీ సన్నగా నవ్వింది. ఈ సారి – సుహాసిని టైప్‌లో!

"ఇవ్వాళ బిర్లా టెంపుల్‌కి రాగలరా?" డబ్బాలో గులకరాళ్లని గబుక్కున కుమ్మరించి నట్లు అనేశాడు.

ఇప్పటికి బాగా చెమట పట్టేసింది చిన్నా రావ్‌కి. ఏ.సి.హాలే అయినా ఫ్యాన్ వేసింది. చాలా రిలీఫ్ ఫీలయ్యాడు. 'థ్యాంక్స్' అన్నాడు – ప్రేమ వైపు కొద్దిగా వంగి.

ప్రేమ ఆలోచనల్లో చాలా విషయాలు కదలాడినై. సమాధానం చెప్పలేదు. రివాల్వింగ్ చెయిర్‌ని తన టేబుల్ ముందుకు – దగ్గరగా జరుపుకుంది.

'అవును. ఏడుగంటలకి క్రింది నుంచీ పద హారో మెట్టుమీద, కుడి అంచున కూర్చుని వుంటాను'.

ఆగేడు... ఆమె ముఖకవళికల్లో అంతగా మార్పేమీలేదు. అలతినవ్వు మాత్రం పెదవుల మీద నిలిచి వుంది. 'కలలోనే ఒక మెలకువగా మెలకువలోనే ఒక కలగా'... అని బాత్‌గానం శ్రుతి చేసుకున్నాడు, లోలోపల! ఉంటాను మరి. మీ కోసం ఎదురు చూ...స్తూ...! అంటూ 'చూ'ని సాగదీసి, దాని కనుగుణంగా తన మెదని పొడవు చేసుకుంటూ తక్కున సీట్లోంచి లేచి గబగబా వెళ్లిపోయాడు.

ప్రేమ నవ్వుకుంది. ఈసారి తనలో తాను! 'చిత్రమైన చిత్తరువు – చిన్నారావ్' అనిపిం చింది.

మంగళవారం. పన్నెండు దాటింది.

చిన్నారావ్ సీటుకి ఎడమవైపు టేబుల్ మీద ఏదో పేపర్ గాలికి ఎగురుతోంది. చూశాడు. తలకాయంత అక్షరాల్లో 'దయచేసి తెగతెంపులు చేసుకోండి' అని హెడ్డింగ్ కనిపిస్తోంది! కుడి వైపు చూశాడు. ప్రేమ! 'నీరెత్తిన నిమ్మచెట్టులా!' ఎప్పుడో చిన్నప్పుడు నాన్నని అట్లా తిడ్తూ వుండేది, నాయనమ్మ!

**విహారి**

'డెవిల్... డెవిల్... డెవిల్...' అని పెదవులు కదిలిస్తూ మూడుసార్లు అనుకుని, గుండెని సిల్హౌటీలోకి నెట్టేస్తూ మూడువందల ముప్ఫై సార్లు అనుకున్నాడు చిన్నారావ్.

క్షణంలో సెట్‌లోకొచ్చాడు మళ్లీ. 'పైగా ముసిముసిగా నవ్వుతోంది చూడు...' అని ఉక్రోషపడ్డాడు. మౌస్‌ని వోచివరకు విసురుగా నెట్టి, కుర్చీలో వాలి, కాళ్లు సాచుకుని కూర్చున్నాడు. చేతులు రెండూ వెనక్కు తీసుకుపోయి, పదివేళ్లనీ బిగించుకుంటూ, మెడకి అదుముకుని, తలని కిందకీ మీదకీ వ్యాయామం చేయించాడు.

చిన్నారావ్ మళ్లీ మన్మథరావయ్యాడు. ప్రేమకేసి చురుగ్గా చూశాడు. ఆమె పెదవుల మీద - కదిలీకదలని అదే ప్రేమైక మందహాసం! మగవాడి అంతఃకరణకి చక్కిలిగిలి పెట్టి, గిలగిల్లాడిస్తూ తాను - 'మోహిని' నవ్వు నవ్వుకుంటూ - మురిసిపోయే కార్పణ్యపు నవ్వు!... ఇలా చిన్నకథ చిన్నారావ్ మనసులోంచీ తేల్తోంది.

ఉన్నట్టుండి గమనించాడు చిన్నారావ్. ఓరకంటితో తనకేసి చూస్తోంది - ప్రేమ! అదేంచూపు? మగవాడి గుండెని కోసి, ముక్కలు చేసి, వేయించుకుతింటూ వింత ఆనందం పొంగేచూపు!...

- కట్ చేస్తే... లంచ్ అవర్.

ఇటు పక్కన రాజారావ్ బుల్లి ట్రాన్సిస్టర్ పైకి పాడుతోంది - 'మగువేగా మగవానికి మధురభావనా...' అని. చిన్నారావ్ గుర్రుగా చూశాడు.

'చెత్తనీతులూ, చచ్చుసూక్తులూ, పుచ్చు సెంటిమెంట్లూ...' సినీ కవుల్ని అందర్నీ సామూహికంగా తిట్టుకున్నాడు. తన ముందు లేరు వాళ్లు - బతికిపోయారు! గ్లాసులో నీళ్లు తాగాడు. టెన్షన్ తగ్గిస్తాయట - నీళ్లు!

'కేంటీన్‌కి వస్తావా?' రాజారావ్! తాను వెళ్లబోతున్నాడు. 'నేను రాన్లే నువెళ్లు' తీవ్రతని అదిమిపట్టి, సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పాడు. విచిత్రప్రాణిని చూసినట్లు చూస్తూ వెళ్లాడు రాజారావ్.


ఇప్పుడు - ప్రేమకేసి మళ్లీ చూశాడు చిన్నారావ్. ఎంతవద్దనుకున్నా - ఆమెవైపే చూడాలనిపిస్తోంది మరి. 'ఛీ...పొమ్మంటే, యస్ వస్తున్నా' అనటమంటారా?! జవాబులేని ప్రశ్న!

సిస్టమ్‌ని స్విచ్ ఆఫ్ చేసి లేచింది ప్రేమ. టిఫిన్‌బాక్స్ తీసుకుని కదిలింది. సీట్‌కి వెనక్కి వచ్చి కుడివైపు వెళ్లి ఎడమకేసి తిరిగి నాలుగడుగులేసింది. ఇప్పుడామె చిన్నారావ్ క్యూబికిల్ ముందు వుంది. ఆగింది. ఒక చేతిని పానెల్ మీద ఆనించింది.

చిన్నారావ్ హడావిడిగా సీట్లో కదిలి, కుర్చీ జరుపుకుని ముందుకు వంగేడు. చుట్టూ చూశాడు. హాలు పల్చగా వుంది. 'చెప్పండి' అన్నాడు ప్రేమకేసి చూస్తూ.

కుడిపాదానికీ, చెప్పుల్‌కీ మధ్య ఇరుక్కున్న చీరె అంచుని సరిచేసుకుని, అలవోకగా నవ్వి 'ఏంలేదు' అంటూ పూవులా కదలి వెళ్లిపోయింది.

జరిగిందేమిటో తెలుసుకున్న చిన్నారావ్‌కి నిజంగా ఏడుపొచ్చింది. జుట్టు పీక్కున్నాడు. పళ్లు కొరుక్కున్నాడు. చొక్కా చేతులు అస్తవ్యస్తంగా మడుచుకున్నాడు. తనకేదో చెప్పబోతోందని - ఉత్కంఠతో, ఆశగా ఎదురు చూస్తే - ప్రేమ, ఎంతో కూల్‌గా 'ఏంలేదు' అని వెళ్లిపో




వడం – అతన్ని పిచ్చెక్కించేస్తోంది... పైగా ఆ నవ్వు! అదే – దేవతలకి అమృతం వొంపుతూ, రాక్షసులకేసి చూస్తూ మోహిని నవ్విన నవ్వు కదూ – అది! చిన్నారావ్ అణువణువునా ఎస్వీ రంగారావ్ హిరణ్యకశిపుడు ప్రవేశించాడు. ఛీ... అని తల విదిలించుకుంటే, ఎన్టీవోడి దుర్యోధనుడు చోటు చేసుకున్నాడు!

నిన్న సాయంత్రం – తనకోసం గుడిమెట్లు మీద కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశాడే... వచ్చీపోయే జనంలో ఒకరిద్దరు పరిచయస్థులు తగిలితే, సిగ్గుతో వంకర్లు తిరిగి, తెచ్చికోలు నవ్వునవ్వి, భేషజంగా – 'హలో'లు చెప్పలేక చచ్చాడే. 'బెగ్గర్'లా ఆ మెట్టు మీద... "ఛీ... ఫూల్‌ని చేసి ఏడిపిస్తోంది... డెవిల్..." అసహాయతలో కసి! కసిలో నీరసం! నీరసంలోనే కోపం! దీన్నేనా 'ప్రేమ' అనేది? అవును. ఈ అవస్థ – ఈ 'ప్రేమ' అనుకున్నాడు. మనస్సు ఏదో ఫొటోలు సర్దుకోసాగింది. వాటికి చిత్ర విచిత్రమైన కేప్షన్‌లూ పెట్టుకుంటోంది. అందులో ఒకటి – ప్రేమ!

ప్రేమ ఉదాసీనత రెప్పల క్రింద వరదని పారిస్తోంది. అప్పుడెప్పుడో – ఎగ్జిబిషన్‌లో – 'నగువనె మనె' స్టాల్‌లో రకరకాల అద్దాల్లో తనబొమ్మని తానే చూసుకుంటే కనిపించిన హాస్య చిత్రం గుర్తుకొచ్చింది. అప్పడాల పిండి ముద్దని నెత్తిమీద చరిస్తే–ఆ ఆకారం వస్తుందా?! ఏమో... జవాబులేని ప్రశ్న! అంటే తను– లాఫింగ్ స్టాక్ అవుతున్నాడా – ప్రేమ ముందు? మళ్లీ జవాబు లే...ని... ప్ర...శ్న!!

'ఇంతేరా ఈ జీవితం... తిరిగే రంగుల రాట్నం...!' ఎందుకైనా మంచిదని లోలోపలే పాడుకున్నాడు. అవునూ – తనకసలు పాత పాటలే గుర్తుకొస్తాయేం? 'వోల్డ్‌స్టాక్' కూడానా తాను? మళ్లీ అదే – జవాబులేని ప్రశ్న!

తలతిప్పి పక్క సీటుకేసి చూశాడు. 'ప్రేమ సీటా? సీటు – ప్రేమా?'!!! అసలు ఈ ఆడవాళ్ళని ఏం చేసినా...? వద్దు... వద్దు... ఎవరైనా

వినగలరు! కసిత్వంలో విప్లవం! ఈసారి 'మనసు గతి ఇంతే...' టచ్ చేసింది! బుడ్డీ, శాలువా గుర్తుకొచ్చి సిగ్గుపడ్డాడు.

సాయంత్రమైంది. ప్రేమలో పని, పనిలో ప్రేమతోనే సమయం తెలీలేదు.

ప్రేమ వెళ్లిపోవటానికి సిద్ధమైంది. చిన్నారావ్ మనస్సు గజిబిజిగా వుంది. అడగాలని వుంది. ఆమెని తిట్టాలనివుంది. నిన్న రానందుకు పోట్లాడాలని వుంది. కానీ, నోరూ, నాలికా ఎండిపోతున్నై. ఎలా? ఆమె వెళ్లిపోతే... రేపు సెలవు. తను భరించలేడు. "వెళ్లడమేనా?" అడిగినట్లున్నాడు. తనకు తెలీదు.

ఆమె తలపైకెత్తి, చూపుల్ని సౌమ్యతలో అద్ది అతని కేసి చూసింది. టేబుల్ వెనక్కి వచ్చి నిలబడింది.

చిన్నారావ్‌కి కుతూహలంగా వుంది. ఆత్రతగా వుంది. ఆందోళనగా వుంది. అనుమానంగా వుంది. ఉత్సుకతతో ఒక్కటంటే ఒక్క కదలిక చూపేడు. ప్రేమ - జడ ముందుకు వేసుకుంటూ, "రేపు సాయంత్రం ఆరింటికి మా ఇంటికి రండి. మాట్లాడుకుందాం", అని "ఇది అడ్రస్" అని స్లిప్ ఇస్తూ గబగబా నడిచి వెళ్లిపోయింది.

ప్రేమ మాటలు కమ్మతెమ్మెరలా వచ్చి చల్లగా స్పర్శించినై. ఆమె పిలుపులో ఎన్నెన్నో అర్థాలు వెతుక్కున్నాడు. ఎన్నెన్నో గుణింతాలు నేర్చుకున్నాడు. చందమామ రావే... జాబిల్లి రావే...' పాట వచ్చింది.

'అవును... ప్రేమ చాలా మంచిది. చాలా తెలివైన పిల్ల. ఇలాంటి యువతి గురించేనా తాను పెద్ద ముళ్లకంచెలా భావించాడు' అని తనను తాను తిట్టేసుకున్నాడు. 'ఫూల్‌ని' అనుకున్నాడు.

మనస్సులో చిచ్చుబుడ్డి వెలిగింది. పూల ముత్యాలు జలజలా ఎగసినై. వెలుతురు పిట్టలు రెపరెపా ఎగిరినై.

'ఎంతా... చల్లని... మనసూ' పాడుకున్నాడు. తర్వాత ఏవిటో రాలేదు! పల్లవి కూడా పూర్తిగా అందలేదు! ఫర్వాలేదులే... అనుకుని, 'సడిసేయకేగాలి...' పాడుకున్నాడు! 'లక్కీ... నిజంగా నేను అదృష్టవంతుణ్ణి' అనుకున్నాడు. 'స్వీట్ డెవిల్ కాదు. ప్రేమ నిజంగా నా లిటిల్ ఏంజిల్' - అని సీరియల్ రాసేసుకోసాగింది చిన్నారావ్ మనసు!

* * *

బుధవారం... అదే... సెలవురోజు. సాయంత్రం ఆరు! సీన్‌లోకొస్తే - 'ప్రేమ' నివాసం. ప్రేమ ముందు చిన్నారావ్!

కాఫీ టిఫిన్‌లు అయినై. కొద్దిసేపు గాలి నడిచింది. గాలి కబుర్లు నడిచినై. టీ.వీ. సీరియల్‌లో అప్పుడే బ్రేక్ వచ్చింది.

ప్రేమలేచి టీ.వీ. ఆఫ్ చేసి కూర్చుంది. కుచ్చెళ్లు సర్దుకుని 'చెప్పండి' అంది.

మాటలు పెగల్లేదు చిన్నారావ్‌కి. ఎలా ప్రారంభించాలో తెలియలేదు. మనస్సులో వేసుకున్న 'రిహార్సల్'ని 'రిట్రీవ్' చేసుకుని, ధైర్యాన్ని కూడదీసుకున్నాడు. 'నేను మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అన్నాడు. 'హమ్మయ్య చెప్పేశాను' అనుకున్నాడు. ఊపిరి పీల్చుకున్నాడు. ఆమె నవ్వుతుందనుకున్నాడు.

ప్రేమ నవ్వలేదు. గంభీరంగా కూర్చుంది.

'నేనూ అనుకోవాలిగా' అని అతన్ని సూటిగా చూసింది. చిన్నారావ్ ఫ్రీజయ్యాడు.

'నా గురించిన వివరాలు...? అని క్షణం ఆగింది.

'చెప్పండి' అన్నాడు చిన్నారావ్.

ప్రేమ ఇప్పుడు అదోలా నవ్వింది. జడ ముందుకు వేసుకుని కొనల్తో ఆడుతూ చెప్పింది. 'నాకు ఒక అక్క, ముగ్గురు చెల్లెళ్లు. అక్కకి విడాకులిచ్చాడు- మా బావ. దానికిద్దరు చిన్న పిల్లలు. నా మొదటి చెల్లెలు - ఫిజికల్లీ హ్యాండీకేప్డ్. రెండో చెల్లెలు చదువులో వుంది. చివరి చెల్లెలు మెంటల్లీ ఛాలెంజ్డ్. అక్కకి అంతగా చదువులేదు. మా అమ్మని చూశారుగదా. ఆమెకి భయంకరమైన మల్టిపుల్ స్క్లెరోసిస్. మంచంలోనే బతుకు".

ఒక్కసారి ఊపిరి తీసుకుంది ప్రేమ. ఆగింది. చిన్నారావ్‌కేసి సూటిగా చూసింది. మళ్లీ చెప్పసాగింది. 'ఈ కుటుంబానికి నేనే ఆధారం. నా జీతమే ఇంత కూడూగుడ్డా సమకూరుస్తున్నది'. 'చూడండి. చిన్నారావ్ గారూ టెక్నికలర్ సినిమా కాదు మా బతుకు. కనీసం బ్లాక్ అండ్ వైట్ కూడా కాదు. ఇరుకు రంగస్థలం'.

కళ్లల్లో చెమరింపుతో అతన్ని చూసింది ప్రేమ.

'భర్త అంటే భరించువాడు అంటారు. మరి నన్ను భరించగలరా?'

గోడకున్న నలదమయంతి ఫొటో చూస్తున్నాడు - చిన్నారావ్. గొంతున పచ్చి వెలక్కాయ పడినట్లయిందతనికి. పేలీపేలని టపాకాయలా అయింది మొహం. 'స్టార్ క్రాస్డ్ లవర్' పదం గుర్తుకొచ్చింది. మీ సమాధానం ఏమిటన్నట్టు చూసింది ప్రేమ. చిన్నారావ్‌కి మాట పెగల్లేదు. అతని అవస్థని గ్రహించిందామె.

'సరే. తీరిగ్గా ఆలోచించండి' అంది.

'అవునవును. అదే బాగుంటుంది' అన్న మొహం పెట్టాడు చిన్నారావ్.

చెప్పడం ఆపి "బాగుందా కథ?" అడిగాను. చంద్రమోహన్ నా వైపు సాలోచనగా చూశాడు. "తర్వాతేం జరిగింది" అన్నాడు.

"కథ అయిపోయింది. చిన్నారావ్‌కి 'తిరిగే రంగులరాట్నం' పాట అర్థమయింది" అన్నాను.

"జీవితమంటే ఇంత దారుణంగా వుండాలా?" అన్నాడు చంద్రమోహన్. 'అన్యాయం. చిన్నారావ్ ప్రేమకథ కూడా విషాదాంతమేనా?' ఎటో చూస్తూ యధాలాపంగా అన్నాడు.

"చిన్నారావ్ ఆ షాక్ నుంచీ ఎట్లా తేరుకున్నాడో. పెళ్లి చేసుకున్నాడో లేదో... పాపం..." చంద్రమోహన్ సందేహం.

"భయపడకు. చిన్నారావ్‌కేం కాలేదు. కామేశ్వరిని చేసుకుని ఆమెని ప్రేమించడం మొదలెట్టాడు. అది వేరే ప్రేమకథ" అన్నాను. "కామేశ్వరి ప్రేమ చెల్లెలే" చెప్పాను.

చంద్రమోహన్ నా వైపు ఆశ్చర్యంగా చూశాడు. అయితే ఇప్పటి చిన్నారావ్ మీకు తెలుసా? అతనెక్కడున్నాడిప్పుడు? అడిగాడు.

నేను నిమ్మళంగా చెప్పాను 'నేనే' ఆ చిన్నారావ్‌ని!'

చంద్రమోహన్ గతుక్కుమన్నాడు!. 'మరి- ప్రేమ?' అడిగాడు.

నేను ఆకాశ చిత్రాలు చూస్తున్నాను! 'ఆమె జీవితం ఇంకా ఉద్యోగాల్లోనే నడుస్తోంది' అన్నాను. 'చాలా మంది ప్రేమ కథలు ఏ లాజిక్‌కీ లొంగవు' అని అన్నాను.

ఏ భావమూ లేని నవ్వు నవ్వాడు. చంద్రమోహన్!